
ఎన్నికల ప్రచారాలపై సూర్యప్రతాపం!



నిజామాబాద్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పార్లమెంట్ ఎన్నికల ప్రచారం చేస్తున్న అభ్యర్థులకు ఎండలు దెబ్బకొడుతున్నాయి. ఉష్ణోగ్రతలు అధికంగా పెరగడంతో అభ్యర్థులు ఉదయం, సాయంత్రం వేళల్లో ఎక్కువగా ప్రచారాలను కొనసాగిస్తున్నారు. ఎండలను తట్టుకునేందుకు మధ్యాహ్నం వేళల్లో ముఖ్యమైన నేతలు అనుచరులతో సమావేశం అవుతూ ఓటర్ల మద్దతును కూడగట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్‌లలో ఎక్కడెక్కడ తమకు అనుకూలంగా ఉందో, ఎక్కడ కొంత వ్యతిరేకత ఉందో పరిశీలిస్తూ తగ్గించుకునే ప్రయత్నాలను చేస్తున్నారు. ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రచారం కొనసాగిస్తున్నారు. నియోజకవర్గాల్లో తమ మద్దతు దారులను, తమ అనుచరులను తిప్పుతూ వివిధ వర్గాల వారితో చర్చలు జరుపుతున్నారు. ఈ ఎన్నికల్లో తమకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. తమను గెలిపిస్తే ఇచ్చిన హామీలను నెరవేరుస్తామని ప్రకటిస్తున్నారు. ఒకరికంటే మరొకరు ఎక్కువ మొత్తంలో ప్రచారాలను కొనసాగించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రధాన పార్టీలకు చెందిన ముగ్గురు అభ్యర్థులు పూర్తిస్థాయిలో ఈ ప్రచారంలో పాల్గొంటున్నారు.

వారం రోజులుగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు

పార్లమెంట్ పరిధిలో గడిచిన వారం రోజులుగా ఎండల వేడి భారీగా పెరిగింది. ఉష్ణోగ్రతలు ఒకేసారి పెరగడం నిజామాబాద్, జగిత్యాల జిల్లాల పరిధిలో 44 డిగ్రీల వరకు నమోదు అవుతుండటంతో మధ్యాహ్నం వేళల్లో ప్రచారం నిర్వహించేందుకు కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి, బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్, బీజేపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్‌లు ఉదయం, సాయంత్రం వేళల్లో ఎక్కువగా ప్రచారానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. గతం కంటే భిన్నంగా

- పార్లమెంట్ అభ్యర్థుల ఎన్నికల ప్రచారానికి ఎండల ఎఫెక్ట్
- ఉష్ణోగ్రతలు పెరగడంతో ఎన్నికల ప్రచారార వేళల్లో మార్పు
- ఉదయం, సాయంత్రం వేళల్లో కొనసాగుతున్న అభ్యర్థుల ప్రచారాలు
- మధ్యాహ్నం వేళల్లో మంతనాలకే ప్రాధాన్యం ఇస్తున్న అభ్యర్థులు
- ఉన్న సమయంలోనే సభలు, రోడ్‌షోలు నిర్వహించేందుకు ప్రయత్నాలు



ఉదయం 6.30ల నుంచే ప్రచారాన్ని మొదలు పెట్టి 10, 11 గంటల్లోపే పూర్తి చేస్తున్నారు. సాయంత్రం 5గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ఈ ప్రచారాలను కొనసాగిస్తున్నారు. ఈ ఎండలు ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు ఎక్కువగా ఉండటం ప్రచారానికి వెళ్లిన ప్రజలెవరూ బయటకు రాకపోవడం వల్ల ఈ నిర్ణయం తీసుకున్నారు. పూర్తిస్థాయిలో ప్రచారాన్ని కొనసాగిస్తూనే మధ్యాహ్నం సమయంలో మంతనాలకు, చర్చలకు వినియోగిస్తున్నారు.

మధ్యాహ్నం వేళ చర్చలు

ఎండల వేడి ఎక్కువగా ఉండటం వల్ల మధ్యాహ్నం సమయంలో పార్టీకి చెందిన సీనియర్ నేతలతో పాటు ఇతర వర్గాలకు చెందిన నేతలను కలుస్తూ వారితో ఎన్నికలపై చర్చిస్తున్నారు. తమకు ఈ దఫా అవకాశం వచ్చిందని పూర్తిస్థాయిలో సహకరించాలని కోరుతున్నారు. వారి మద్దతును కూడగట్టడంతో పాటు భారీ స్థాయిలో ఓట్లను సాధించేందుకు ప్రయత్నాలను చేస్తున్నారు. ఈ ఎన్నికలు కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులకు కీలకం కావడంతో పూర్తిస్థాయిలో ఈ ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లో అవకాశాన్ని చేజార్చుకోకుండా ఉండేందుకు సన్నద్ధమవుతున్నారు. తమకు ఈ దఫా అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో మండల స్థాయితో పాటు మేజర్ గ్రామ పంచాయతీల్లో రోడ్‌షోలు, సభలను నిర్వహిస్తూ ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. తాము వెళ్లే గ్రామాలు, మండలాల్లో ఎక్కువ మొత్తంలో నేతలు, కార్యకర్తలు ఉండే విధంగా చూసుకోవడంతో పాటు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండే విధంగా ఏర్పాట్లను చేసుకుంటున్నారు. రోడ్‌షోలు, సభలలో పార్టీకి చెందిన వారే కాకుండా ఓటర్లు పాల్గొనే విధంగా ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రచారానికి ఇంకా 12 రోజులే సమయం ఉండటంతో సర్వశక్తులను ఒడ్డుతూ ప్రయత్నాలు చేస్తున్నారు. నామినేషన్‌లు వేసేంత వరకు అభ్యర్థులు ఖర్చుకు వెనుకాడిన ప్రస్తుతం భారీ ఎత్తున పెడుతున్నారు. బూత్ స్థాయిలో ఎక్కువగా ఖర్చు చేస్తున్నారు. బహిరంగ సభలకు కూడా ఎక్కువ మొత్తంలో వెచ్చిస్తున్నారు. ఉన్న సమయాన్ని తమకు అనుకూలంగా మలుచుకోవడంతో పాటు ఎలాగైనా గెలిచేందుకు ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు.

ప్రచారంపైనే అభ్యర్థుల ఫోకస్

ఎండలు ఎక్కువగా ఉన్న నిరంతరం ప్రచారంపైనే అభ్యర్థులు ఫోకస్ పెడుతూ ముందుకు పోతున్నారు. వచ్చే 12 రోజుల్లో భారీ బహిరంగ సభలు, రోడ్‌షోలు ఎక్కువగా నిర్వహించడంతో పాటు కీలకమైన నేతలు హాజరయ్యే విధంగా ప్రయత్నాలను చేస్తున్నారు. మొత్తంగా ఎండలు ఎక్కువగా ఉన్న అనుకూల సమయంలోనే ప్రచారాలను నిర్వహిస్తూ మిగతా సమయాలను మంతనాలు చేసేందుకు వినియోగిస్తున్నారు. కొంత మంది నేతలకు నచ్చచెబుతూ తాము గెలిస్తే తగిన అవకాశాలను ఇస్తామని చెబుతూ ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. వచ్చే మిగతా ఎన్నికల ప్రచారాలు కూడా ఉదయం, సాయంత్రం వేళల్లోనే నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. ఎండల వేడి అభ్యర్థులకు ఇబ్బందులు పెట్టిన ప్రచార గడువు దగ్గర పడుతుండటంతో పూర్తిస్థాయిలో కేటాయిస్తున్నారు. ఓటర్ల మద్దతును కూడగట్టే ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. ఈ ఎన్నికల్లో ఎవరికి ఓటర్లు పట్టం కడతారో కానీ అభ్యర్థులు మాత్రం పూర్తిస్థాయిలో ఎండలను సైతం లెక్కచేయకుండా ప్రచారాలను కొనసాగిస్తున్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి

నిజామాబాద్‌ను స్మార్ట్ సిటీ చేస్తా

● కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి

మోపాల్, ఏప్రిల్ 28: పార్లమెంట్ ఎన్నికల్లో తనను ఆశీర్వదించాలని తనను గెలిపిస్తే నిజామాబాద్‌ను స్మార్ట్ సిటీ చేస్తానని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జీవన్‌రెడ్డి కోరారు. నిజామాబాద్‌లోని 5వ డివిజన్ బోర్గాం(పి), మోపాల్ మండలంతో పాటు ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. కేసీఆర్ కుటుంబ పాలన చూసి రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టం కట్టారని అన్నారు. పేద ప్రజల కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరు గ్యారంటీలను అమలు చేస్తున్నారని అన్నారు. నిజామాబాద్ నగరాన్ని స్మార్ట్ సిటీగా మార్చడంతో పాటు ఔటర్ రింగ్‌రోడ్ కూడా ఏర్పాటుకు కృషి చేస్తానని తెలిపారు. మూతపడిన చక్కెర కర్మాగారం కూడా తెరిపించేందుకు కృషి చేస్తానన్నారు. ఎంపీగా ఉన్న అర్వింద్ ఐదేళ్ల కాలంలో చేసిన అభివృద్ధి ఏమీ లేదని ఎద్దేవా చేశారు. రైతులకు రాసి ఇచ్చిన పసుపు బోర్డు బాండ్‌ను తీసుకురాలేకపోయారని అన్నారు. బీఆర్ఎస్, బీజేపీ మాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దని కోరారు. ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని అన్నారు. ఎంపీగా గెలిపిస్తే ఇంజనీరింగ్ కళాశాలతో పాటు మహిళ కళాశాలను ఏర్పాటు చేయిస్తామన్నారు. రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి మాట్లాడుతూ.. పేద ప్రజల కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతున్నారని తెలిపారు. గత పాలకులు తెలంగాణ అభివృద్ధి పట్ల నిర్లక్ష్యం చేశారని మండిపడ్డారు. దోచుకోవడం దాచుకోవడం తప్ప మరొకటి లేదని అన్నారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీ పార్టీలకు ప్రజలు తగిన బుద్ధి చెబుతారని అన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ నగేష్‌రెడ్డి, కిసాన్‌కేత్ జిల్లా అధ్యక్షుడు ముప్ప గంగారెడ్డి, బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌గౌడ్, భాస్కర్‌రెడ్డి, భూంరెడ్డి, సొసైటీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ జిల్లా మాజీ అధ్యక్షుడు గంగారెడ్డి

బీఆర్ఎస్ పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు ఈగ గంగారెడ్డి కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన గంగారెడ్డికి జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే భూపతిరెడ్డి పార్టీ కండువా కప్పి స్వాగతం పలికారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా గంగారెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా పది సంవత్సరాలు ఉన్నప్పటికీ తనకు అందులో ప్రాధాన్యం లభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ఓటరు స్లిప్‌ల పంపిణీ

కోటగిరి, ఏప్రిల్ 28: మండల కేంద్రంలో ఆదివారం ఇంటింటికీ వెళ్లి ఓటర్ స్లిప్‌లను పంపిణీ చేశారు. కోటగిరి సెక్టార్ ఆఫీసర్ ప్రమోద్ ఆధ్వర్యంలో ఓటర్ స్లిప్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఎల్‌వో, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



కోటగిరిలో ఓటర్ స్లిప్‌లు పంపిణీ చేస్తున్న అధికారులు



పెగడాపల్లిలో బోనాల పండుగ దృశ్యం

ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో

బోనాల పండుగ

బోధన్‌రూరల్, ఏప్రిల్ 28: బోధన్ మండలంలోని పెగడాపల్లి గ్రామంలో పెద్దమ్మ తల్లికి బోనాల పండుగ నిర్వహించారు. ఈసందర్భంగా ప్రధాన వీధుల గుండా మహిళలు బోనాలతో ఊరేగింపుగా తరలి వెళ్లారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఒడి బియ్యం కార్యక్రమం నిర్వహించారు. ప్రజలందరు ఆయురారోగ్యాలతో ఉండాలని, పాడిపంట చల్లగా ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ కులసంఘం నాయకులు రాము, అల్లం గంగాధర్, ఎల్లప్ప, అబ్బయ్య, సుదర్శన్ పాల్గొన్నారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత



నాడాపూర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

నవీపేట, ఏప్రిల్ 28: ప్రతిరోజూ ధ్యానం చేయడం ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని పిరమిడ్ స్పిర్చువల్ సొసైటీస్ మూమెంట్ ఆఫ్ ఇండియా(పీఎస్ఎస్ఎం) జిల్లా అధ్యక్షుడు, అడ్వకేట్ సాయి కృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని నాడాపూర్‌లో పీఎస్ఎస్ఎం ఆధ్వర్యంలో ధ్యాన, ఆత్మ జ్ఞాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధ్యానం చేయడం ద్వారా మానసిక ప్రశాంతతతో పాటు ఒత్తిడిని తట్టుకునేలా చేస్తుందన్నారు. ఈ ఆధునిక యుగంలో ప్రతి ఒక్కరూ ధ్యానం చేసి సుఖసంతోషాలతో ఉండాలని కోరారు. ఈ సందర్భంగా గ్రామంలో అహింసయుత మెగా శాకాహార ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లలిత, మోనాజీ, శరత్ చంద్ర, దయానంద్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

శాకాహారంతో పాటు ధ్యానం అలవర్చుకోవాలి..

బోధన్‌రూరల్, ఏప్రిల్ 28: ప్రజలు శాకాహారంతో పాటు ధ్యానం అలవర్చుకుంటే 'నో డాక్టర్ నో మెడిసిన్' అని ఇందూర్ బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ అప్పల నాయుడు అన్నారు. ఆదివారం కుర్నాపల్లి గ్రామంలో గ్రామస్థులకు శాకాహారం, ధ్యానంపై అవగాహన కల్పించారు. ప్రజలు ధ్యానం చేస్తూ ఆత్మ విశ్వాసంతో విజయాలు సాధించాలని పిలుపునిచ్చారు. మాంసహారం కంటే శాకాహారం చాలా మంచిదన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు కమలా కుమారి, కొండ యాదయ్య, సాయినాథ్, కొండ భరత్, పోసాని, లక్ష్మి, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్ల ఉపసంహరణపై నేతల దృష్టి



నిజామాబాద్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పార్లమెంట్ ఎన్నికల్లో నామినేషన్, పరిశీలన ఘట్టం ముగియగా ప్రధాన పార్టీల అభ్యర్థుల్లో పరేషాన్ మొదలైంది. నామినేషన్ల ఉపసంహరణపై నేతలు దృష్టి పెట్టారు. ఈ ఎన్నికల్లో గుర్తింపు పొందిన పార్టీల అభ్యర్థులతో పాటు స్వతంత్ర అభ్యర్థులు ఎక్కువ మందే బరిలో ఉండడంతో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులు ఇబ్బంది పడుతున్నారు. వారిలో కొంత మందిని ఉపసంహరించుకునే విధంగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఎక్కువ మంది ఉంటే గుర్తుల కేటాయింపులో తమకు ఇబ్బంది వస్తుందని భావిస్తున్నారు. ఇంకా విత్‌డ్రాకు ఒకేరోజు సమయం ఉండడంతో నేతలు వారితో చర్చలు జరుపుతున్నారు. నామినేషన్‌లు ఉపసంహరించుకొని తమకు మద్దతు ఇచ్చే విధంగా ప్రయత్నాలను చేస్తున్నారు. కొంతమందికి నచ్చజెప్పడంతో పాటు మరికొంత మందిని బుజ్జగిస్తూ ఈ ప్రయత్నాలను చేస్తున్నారు.

42మంది నామినేషన్లు

నిజామాబాద్ పార్లమెంట్ ఎన్నికల కోసం మొత్తం 42మంది నామినేషన్‌లు వేశారు. వీరిలో 10 మంది సరైన పత్రాలు సమర్పించకపోవడం వల్ల పరిశీలనలో నామినేషన్లను రిజెక్ట్ చేశారు. ప్రస్తుతం 32మంది పోటీలో ఉన్నారు. వీరిలో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులను మినహాయిస్తే గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల అభ్యర్థులతో పాటు స్వతంత్ర అభ్యర్థులు ఎక్కువ మంది ఉన్నారు. ప్రతి ఎన్నికల్లో ఒక్క ఈవీయంలో 16మందికి అవకాశం ఉంటుంది. ఒక్క ఈవీఎంలో 15మంది అభ్యర్థులకు అవకాశం ఇస్తారు. ఒక నోటా ఉంటుంది. అంతకు మించి అభ్యర్థులు పోటీలో ఉంటే రెండో ఈవీఎంను ఉపయోగిస్తారు. ప్రస్తుతం 32మంది బరిలో ఉన్నారు. వీరందరు పోటీలో ఉంటే మూడు ఈవీ ఎంల అవసరం ఉంటుంది. అభ్యర్థులు తగ్గితే ఒకటే ఈవీఎం ద్వారా ఎన్నిక జరగనుంది.

- నామినేషన్ ఘట్టం ముగియడంతో ప్రధాన పార్టీల్లో మొదలైన పరేషాన్
- పోటీలో స్వతంత్రులు, గుర్తింపు పొందిన పార్టీల అభ్యర్థులు
- ఉప సంహరణ కోసం ప్రయత్నాలు చేస్తున్న ప్రధాన పార్టీల నాయకులు



అభ్యర్థులతో నేతల సంప్రదింపులు

స్వతంత్ర అభ్యర్థులతో పాటు గుర్తింపు పార్టీల ద్వారా పోటీ పడుతున్న అభ్యర్థులతో కొంతమంది నేతలు సంప్రదింపులు జరుపుతున్నారు. ప్రధాన పార్టీల తరపున నేతలు వారితో చర్చిస్తూ ఉపసంహరించుకోవాలని కోరుకుంటున్నారు. పోటీలో తక్కువ మంది ఉంటే ఫోకస్ అంతా ప్రధాన పార్టీలపైనే ఉండడం వల్ల కలిసివస్తుందని భావిస్తున్నారు. కొన్ని సమయాల్లో కొన్ని రకాల గుర్తుల వల్ల ప్రధాన పార్టీల అభ్యర్థులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గుర్తు కొన్నిసార్లు ఇతర గుర్తులను పోలి ఉండడం వల్ల ఓటర్లు కన్‌ఫ్యూజ్ అయ్యి ఆ గుర్తులకు వేసే అవకాశం ఉండడంతో తమవంతు ప్రయత్నాలు చేస్తున్నారు. నామినేషన్ ఉపసంహరించుకునేందుకు నేటి వరకు గడువు ఉండడంతో పూర్తిస్థాయిలో ప్రయత్నాలను చేస్తున్నారు. స్వతంత్ర్య అభ్యర్థులతో పాటు గుర్తింపు పొందిన అభ్యర్థులతో చర్చలు జరుపుతు అనుకూలంగా మార్చుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. కొంత మందితో చర్చలు జరుపుతూ తమ అభ్యర్థి గెలిస్తే తగిన అవకాశాలు పార్టీలో కల్పిస్తామని హామీలు ఇస్తున్నారు. పూర్తిస్థాయిలో ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసిన తర్వాత విత్‌డ్రా అయిన వారిని మినహాయించి మిగతా వారిని పోటీలో ఉన్నట్లు అధికారులు ప్రకటిస్తారు. ప్రధాన పార్టీలతో పాటు గుర్తింపు ఉన్న పార్టీలకు వాటి గుర్తులనే కేటాయిస్తారు. స్వతంత్ర అభ్యర్థులకు వారు సూచించిన మూడు గుర్తుల్లో ఒకదాన్నే వారికి కేటాయిస్తారు. ఉపసంహరణ గడువు ముగిసిన తర్వాత ఎన్నికల కోసం పూర్తిస్థాయిలో ఏర్పాట్లలో నిమగ్నమవుతారు. సమయం తక్కువగా ఉండడంతో పూర్తిస్థాయిలో నేతలు ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. ఈ చివరి రోజు ఎంతమంది నామినేషన్ ఉపసంహరించుకుంటారో, ఎంతమంది బరిలో ఉంటారో తేలే అవకాశం ఉంది.



బోనాలతో ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

ఘనంగా పోచమ్మ బోనాలు

ఎడపల్లి, ఏప్రిల్ 28: ఎడపల్లి మండల కేంద్రంలో గౌడ కులస్థుల ఆధ్వర్యంలో ఆదివారం పోచమ్మ దేవతలకు ఘనంగా బోనాలు సమర్పించారు. మండల కేంద్రంలోని నయాబాదిలో నూతనంగా నిర్మించిన రేణుకా ఎల్లమ్మ కల్యాణ ఉత్సవాలను గత మూడు రోజులుగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా గ్రామంలో ఉన్న పోచమ్మ తల్లులకు గౌడ కులస్థులు బోనాలు సమర్పించారు. గౌడ కులస్థులు తమ ఇంటి నుంచి బోనమెత్తుకుని డప్పుల చప్పుడు, మేళ తాళాలతో పోతు రాజుల విన్యాసాలతో బోనాలతో బయలుదేరి పోచమ్మ ఆలయానికి చేరుకుని బోనం సమర్పించి ప్రత్యేక నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ గౌడ కులస్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రామ్మోహన్‌రెడ్డి

'గిరిరాజ్'లో అవగాహన కార్యక్రమం

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 28: నగరంలోని గిరిరాజ్ కళాశాలలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ, పీజీ ఓరియంటేషన్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. మొదటి సంవత్సరంలో చేరిన విద్యార్థులకు అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. ఓపెన్ డిగ్రీ, పీజీ చదివి ఉత్తీర్ణులైతే రెగ్యులర్ విద్యార్థులతో సమానంగా ఉద్యోగ అవకాశాలు ఉంటాయని ప్రిన్సిపాల్ తెలిపారు. విద్యాభ్యాసాన్ని కొనసాగిస్తూనే మెలకువలను నేర్చుకోవాలని తెలిపారు. డిగ్రీ, పీజీ స్థాయిలో ఇతర అంశాలపైన పట్టు సాధిస్తే ఉద్యోగ అవకాశాలు వస్తాయని అన్నారు. డిగ్రీ, పీజీ స్థాయిలో 1300 మంది విద్యార్థులు అడ్మిషన్లు తీసుకున్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ రంజిత, డాక్టర్ ఆదెప్ప, డాక్టర్ వేణుప్రసాద్, డాక్టర్ అజారే శ్రీనివాస్, అశోక్ రావు, ప్రవీణ్‌రెడ్డి, పోశెట్టి, ప్రవీణ్‌కుమార్, సయ్యద్, తదితరులు పాల్గొన్నారు.



పోటీలకు ఎంపికైన విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు సిరికొండ విద్యార్థి

సిరికొండ, ఏప్రిల్ 28: సౌత్‌జోన్ జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీలకు సిరికొండ విద్యార్థి సిద్ధార్థ ఎంపికయ్యారు. ఈనెల 28 నుంచి 30 వరకు కర్నాటక రాష్ట్రంలోని తుంకూర్ జాతీయ సాఫ్ట్‌బాల్ క్రీడాపోటీల ప్రారంభమయ్యాయి. ఈ పోటీల్లో తెలంగాణ రాష్ట్ర జట్టు తరఫున సిద్ధార్థ ఆడుతున్నాడు. సిద్ధార్థ ఈనెల 18న మెదక్ జిల్లా మనోహరాబాద్‌లో జరిగిన సెలెక్షన్‌లో రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యాడు.

ఖరీఫ్‌కు సిద్ధమవుతున్న రైతులు

● పంట పొలాలకు నల్లమట్టి తరలింపు ● పూడిక మట్టితో ప్రయోజనం చేకూరుతుందంటున్న రైతులు

ఆర్మూర్‌రూరల్, ఏప్రిల్ 28: గతంలో వేసవికాలం వచ్చిందంటే గ్రామీణ ప్రాంతాల్లో రైతులు ఎడ్లబండ్లతో చెరువులోని పూడిక మట్టిని తీసి పంటపొలాలకు వేస్తూ ఖరీఫ్‌కు సిద్ధమయ్యేవారు. రానురాను పశుసంతతి తగ్గిపోవడంతో రైతులు నల్లమట్టిని ట్రాక్టర్‌లు, టిప్పర్‌ల ద్వారా తమపంట పొలాలకు చేరవేస్తున్నారు. నల్లమట్టి వాడకంతో భూములు సారావంతమై నాణ్యమైన పంట పండడమే గాకుండా రసాయనిక ఎరువులు వాడకం, తగ్గి పెట్టుబడులు తగ్గుతాయి. దీంతో చీడపీడల బెడద కూడా తక్కువగా ఉంటుంది. చెరువు పూడిక పంట పొలాలకు వాడడంతో రైతులకు బహుళప్రయోజనాలు ఉన్నాయి. నల్లమట్టి వేయడం వల్ల భూమికి పోషకాలు ఉండి పంటలు సమృద్ధిగా పండుతాయని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

● భూసారం పెరుగుతుందంటున్న రైతులు

పంట పొలాలకు నల్లమట్టి వేయడంతో భూసారం పెరుగుతుందని రైతులు చెప్తున్నారు. ఇంతకాలం పంటపొలాల్లో విచ్చలవిడిగా రసాయనిక ఎరువులు వాడకం ఎక్కువైంది. దీంతో భూమిలో సేంద్రియ ఎరువుల వాడకం తగ్గిపోవడంతో భూభౌతిక లక్షణాలు దెబ్బతింటున్నాయి. దీనివల్ల దిగుబడులు రాక రైతులు ఆశించిన స్థాయిలో ప్రయోజనం పొందలేకపోతున్నారు. నల్లమట్టి, ఒండ్రుమట్టి వాడడం వల్ల పంటల చీడపీడల ఆశించకుండా ఉంటాయి.

● భూసార పరీక్షలతో రైతులకు మేలు

రైతులు ప్రతీ సంవత్సరం భూసార పరీక్షలు చేయించుకొని, దానికి అనుగుణంగా పంటలను వేసుకోవాలని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. సేంద్రియ ఎరువులు, రసాయనిక ఎరువులు, శాస్త్రవేత్తల సూచన మేరకు వాడితే రైతులకు వ్యయం తగ్గి లాభాలు పెరిగే అవకాశం ఉంది.


పంట పొలాల్లో వేసిన నల్లమట్టి

పంటలకు నల్లమట్టి వాడడంతో తేమను నిల్వ ఉంచడమే కాకుండా రోగనిరోధక శక్తి పెరిగి చీడపీడల బారీ నుంచి పంటలను రక్షించవచ్చు.

● చెరువుల్లో పెరుగుతున్న నీటి నిల్వ సామర్థ్యం

గ్రామాల్లో చెరువులకు ప్రాధాన్యత అంతాఇంతా కాదు. చెరువుల ఆధారంగా ఊరు బతికేది. చెరువులో పూడిక పేరుకుపోయి నీటి నిల్వలు తగ్గుతాయి. దీంతో సమీపంలోని వ్యవసాయ బావులకు కూడా భూగర్భ జలాలు అడుగంటిపోయే ప్రమాదం ఉంది. నల్లమట్టి పూడిక తీయడంతో చెరువులు, గోదావరి తీరంలోని ప్రాజెక్టులో నీటినిల్వ సామర్థ్యం పెరుగుతోంది. చెరువుల్లో సుమారు 3నుంచి 4అడుగుల వరకే నల్లమట్టి తీయడంతో రైతులకు ప్రయోజనకరంగా ఉంటుంది. చెరువుల్లో పూడిక మట్టి తీయడంతో నీటి నిల్వ సామర్థ్యం పెరగడంతో భూగర్భజలాలు


టిప్పర్ ద్వారా నల్లమట్టిని వేస్తున్న దృశ్యం

అందుబాటులోకి వస్తాయి. అంతేగాకుండా చెరువుల ఆధారంగా జీవనోపాధి పొందే వారికి ప్రయోజనకరంగా ఉంటుంది.

పంట దిగుబడులు పెరుగుతాయి..

● రాజవెంకటరెడ్డి, ఏసీపీ, నిజామాబాద్

పంటపొలాల్లోకి నల్లమట్టిని చేరవేయడంతో భూమి సారవంతమవడమే కాకుండా పంట దిగుబడులు పెరుగుతాయి. పశువుల పేడ లభించకపోవడంతో నల్లమట్టిపైనే రైతులు ఆధారపడుతున్నారు. ఈ ఏడాది 120 ట్రాక్టర్‌ల నల్లమట్టిని వేయించారు. పంట పొలాలకు నల్లమట్టిని తరలించడం ద్వారా చెరువుల్లో పూడికతీతతో నీటి నిల్వసామర్థ్యం, భూగర్భజలాలు పెరుగుతాయి.


వేదికపై 2003-2004 బ్యాచ్ చౌట్‌పల్లి పదోతరగతి విద్యార్థులు

చౌట్‌పల్లిలో పూర్వ విద్యార్థులు అపూర్వ సమ్మేళనం

కమ్మర్‌పల్లి, ఏప్రిల్ 28: మండలంలోని చౌట్‌పల్లి ఉన్నత పాఠశాలలో 2003-2004 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు అపూర్వ సమ్మేళనం జరుపుకున్నారు 21ఏళ్ల తర్వాత అందరూ కలుసుకోవడం ఆనందంగా ఉందని అన్నారు. ఈ సందర్భంగా పూర్వవిద్యార్థులు పాఠశాలలోని తరగతి గదిలో కూర్చొని గత స్మృతులను నెమరు వేసుకున్నారు. అనంతరం తమకు విద్యాబోధన చేసిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించుకున్నారు. కార్యక్రమం అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆడిపాడుతూ ఆనందంగా గడిపారు.


మాట్లాడుతున్న బుర్రి ప్రసాద్

కార్పొరేట్ కంపెనీల కోసం
ప్రజాధనం లూటీ చేశారు

● సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకుడు బుర్రి ప్రసాద్

పెద్దబజార్, ఏప్రిల్ 28: ప్రభుత్వరంగ సమస్యలను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతూ ప్రజాధనం లూటీ చేశారని సీపీఎం రాష్ట్ర నాయకుడు బుర్రిప్రసాద్ అన్నారు. ఆదివారం నగరంలోని నాందేవ్‌వాడలోగల సీపీఐ(ఎం) పార్టీ కార్యాలయంలో పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. బీజేపీ ప్రజల కు ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంతోపాటు రైతాంగ వ్యతిరేక చట్టాలను తీసుకురావడంతో వందలాది మంది రైతులు తమప్రాణాలను సైతం లెక్కచేయకుండా ఢిల్లీ సరిహద్దుల్లో పోరాటంచేసి అనేక మంది ప్రాణాలు కోల్పోయారని అన్నారు. కార్పొరేట్ కంపెనీలకు పెట్టుబడిదారులకు లాభాలు చేకూర్చడం కోసం కార్మికచట్టాల్లో మార్పులు తెచ్చి కార్మిక హక్కులను కాలరాస్తున్నారని అన్నారు. ప్రైవేటు కంపెనీలో రిజర్వేషన్లు అమలు జరుపకుండా పేద మధ్యతరగతి ప్రజానీకం ఉపాధి అవకాశాలు తగ్గి పేదరికంలో నెట్టివేయబడ్డారని అన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌బాబు మాట్లాడుతూ నిత్యవసర సరుకుల ధరలు విపరీతంగా పెంచడంతో ప్రజల జీవన ప్రమాణాలు పడిపోయాయని అన్నారు. ప్రజలకు ఉన్న హక్కులను కాలరాసే పద్దతిలో రాజ్యాంగాన్ని మార్చి లౌకిక ప్రజాస్వామ్యానికి నష్టం చేకూర్చేపని చేయాలనుకుంటున్నారని అన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా నాయకులు పెద్దివెంకట్రాములు, నూర్జహాన్, వెంకటేష్, శంకర్‌గౌడ్, గంగాధర్, సిర్పలింగం, కటారి రాములు, అనసూయమ్మ, శ్రీనివాస్, గంగాధర్ పాల్గొన్నారు.

అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే చర్యలు

బోధన్‌రూరల్, ఏప్రిల్28: అక్రమ ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని బోధన్ పట్టణ ఎస్సై నాగనాథ్ తెలిపారు. అక్రమ ఇసుక రవాణాచేస్తున్న ఒక ఆటోతో పాటు మూడు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఆయన తెలిపారు. మంజీర పరివాహక ప్రాంతం నుంచి కల్దుర్కి మీదుగా బోధన్ వైపు అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకుని స్టేషన్‌కు తరలించామన్నారు. ట్రాక్టర్లను పట్టుకుని కేసులు నమోదు చేశామన్నారు. అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన పేర్కొన్నారు.

భూలక్ష్మీ విగ్రహ ప్రతిష్ఠాపన

ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్28: పట్టణంలోని మహాలక్ష్మీ ఫంక్షన్‌హాల్‌లో సర్వసమాజ్ ప్రజా ఐక్యసమితి ఆధ్వర్యంలో ఆదివారం భూలక్ష్మీ మాత విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భూలక్ష్మీ మాతకు నైవేద్యాలు, పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్వసమాజ్ ప్రజా ఐక్య సమితి సభ్యులు ఆకుల రాజు, కార్యదర్శి కర్తన్ దినేష్, మాజీ సర్వ సమాజ్ అధ్యక్షుడు డాన్ మహి, సభ్యులు, ఆయాసంఘాల అధ్యక్ష, కార్యదర్శులు ఉన్నారు.


విగ్రహ ప్రతిష్ఠాపన నిర్వహిస్తున్న ఐక్యసమితి సభ్యులు


డిచ్‌పల్లిలో వాహనాలు తనిఖీలు చేస్తున్న పోలీసులు

డిచ్‌పల్లిలో వాహనాల తనిఖీ

డిచ్‌పల్లి, ఏప్రిల్28: మండలకేంద్రంలో డిచ్‌పల్లి పోలీసులు వాహనాలు తనిఖీలు చేపట్టారు. సెల్‌ఫోన్ మాట్లాడుతు డ్రైవింగ్ చేస్తూ పట్టుబడిన వారికి, హెల్మెట్‌లేకుండా ప్రయాణిస్తున్న వాహనచోదకులకు, జరిమానాలు విధించారు. అల్కాహల్ పరీక్షలు నిర్వహించారు. సరైనపత్రాలు లేని వాహనదారులకు జరిమానాలు విధించారు. ప్రతీఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రమాదాల ను తగ్గించాలని పోలీసులు కోరారు.

బెల్లాల్ కారోబార్‌కు నోటీసులు

బోధన్‌రూరల్, ఏప్రిల్28: మండలంలోని బెల్లాల్ గ్రామ పంచాయతీ కారోబార్‌కు బోధన్ ఎంపీడీవో వెంకటేశ్ జాదవ్ సంజాయిషి నోటీసు జారీచేశారు. ఆసరా పింఛన్లు పంపిణీ చేసేందుకు డబ్బులు డిమాండ్ చేస్తున్నారన్న ఆరోపణలు రావడంతో కారోబార్‌కు సంజాయిషి నోటీసులు పంపించామని, మూడురోజుల్లో వివరణ ఇవ్వాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పింఛన్ల పంపిణీలో ఎవరూ ప్రజల వద్ద నుంచి డబ్బులు డిమాండ్ చేయవద్దని ఆయన సూచించారు.

మతవిద్వేశాలు రెచ్చగొట్టి
ఎన్నికల్లో గెలిచేందుకు బీజేపీ కుట్ర

● సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు

పెద్దబజార్, ఏప్రిల్ 28: మతం పేరుతో ప్రజల మధ్య మత విద్వేశాలు రెచ్చగొడుతున్నారని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య, డివిజన్ కార్యదర్శి వేల్పూర్ భూమయ్య అన్నారు. ఆదివారం నగరంలోని కోటగల్లిలోగల ఎన్ఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ బీజేపీ గత పది సంవత్సరాల కాలంలో ప్రజలు చెమటోర్చి సంపాదించిన డబ్బును జీఎస్టీ పేరుతో పన్నుల రూపంలో వచ్చిన సంపదను కొద్దిమంది పెట్టుబడిదారులకు కట్టబెడుతూ బడా పెట్టుబడి దారులను వేల కోట్ల రూపాయలు బ్యాంకులో అప్పులు రద్దు చేశారని అన్నారు. ప్రభుత్వ సెక్టర్‌కి సంబంధించిన సమస్యలను ప్రైవేటీకరణ చేస్తున్నారని అన్నారు. ప్రైవేటీకరణలో రిజర్వేషన్లు రద్దు అవుతాయని కిందిస్థాయి ప్రజలకు ఉద్యోగ అవకాశాలు లేకుండాపోతాయని అన్నారు. పార్లమెంట్‌లో 400 సీట్లు గెలిస్తే రాజ్యాంగాన్ని మార్చే ఆలోచనలో బీజేపీ ప్రభుత్వం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో న్యూడెమోక్రసీ నాయకులు శివకుమార్, జల్ల మురళి, మోహన్, శంకర్, రాజు, ఎల్లప్ప తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నాయకులు


మాట్లాడుతున్న యోగేంద్రయాదవ్

బీజేపీ మరోసారి అధికారంలోకి వస్తే..
సొంత రాజ్యాంగం అమలు

● భారత్ జోడో అభియాన్ జాతీయ కన్వీనర్ యోగేంద్ర యాదవ్

పెద్దబజార్, ఏప్రిల్ 28: బీజేపీ మరోసారి అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని తొలగించి మత విద్వేశాలతో కూడిన సొంత రాజ్యాంగాన్ని అమలు చేస్తుందని భారత్‌జోడో అభియాన్ జాతీయ కన్వీనర్ యోగేంద్ర యాదవ్ ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం నగరంలోని న్యూఅంబేద్కర్ భవన్‌లో ప్రజాస్వామ్య పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో పార్లమెంట్ ఎన్నికలు ఓటర్ల బాధ్యత అనే అంశంపై సదస్సును నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా మతవిద్వేశాలు రెచ్చగొట్టే భారతీయ జనతా పార్టీకి వ్యతిరేకమైన పవనాలు వీస్తున్నాయని అన్నారు. ఎక్కువగా ఆశలు పెట్టుకున్న రాజస్థాన్, ఉత్తర్‌ప్రదేశ్, హర్యానా, గుజరాత్ రాష్ట్రాల్లో కూడా ఓటర్ల నాడిని చూస్తే సగానికి పైగా సీట్లల్లో ఇండియా కూటమి అభ్యర్థులు గెలవబోతున్నారని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటికే తెలంగాణ ఓటర్లు ఒక్క నియంతనను తొలగించుకున్నారని, ఒక్కో నియంతన బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. దేశ ప్రజలకు బీజేపీ యొక్క అసలురంగు అర్థమైందని అన్నారు. కార్యకర్తలు, ప్రజాస్వామ్య సంఘాల ప్రతినిధులు ప్రజల వద్దకు వెళ్లి వాస్తవాలు ఏమిటి, అబద్దాలు ఏమిటి తెలియాలని కోరారు. సమావేశంలో డాక్టర్ రవీంద్రనాథ్ సూరి, రైతు స్వరాజ్ జాతీయ నాయకులు కిరణ్, ప్రొఫెసర్ సుకుమార్, నర్రరామారావు, రామ్మోహన్‌రావు, షేక్‌హుస్సేన్, భాస్కర్, నర్సింలు, డాక్టర్ రామ్మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన బైబిల్ పఠన తరగతులు


విద్యార్థులకు ప్రతిభ పత్రాలు అందజేస్తున్న పాస్టర్లు

డిచ్‌పల్లి, ఏప్రిల్ 28: బర్దిపూర్ చర్చిలో వేసవికాల విరామ బైబిల్ పఠన తరగతుల ముగింపు కార్యక్రమం ఆదివారం ముగిసింది. గత నాలుగు రోజులుగా బైబిల్ తరగతులు ప్రెసిబిటర్ ఇన్‌చార్జి జీడీసీసీ సండే స్కూల్ సెక్రటరీ రెవరెండ్ దినకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ తరగతుల్లో ప్రతిభ చూపిన వారికి ధృవీకరణపత్రాలు అందజేశారు. చిన్నారులు ఆట పాటలతో బైబిల్ వాక్యములను పఠించి అందరిని ఆకర్షించారు. కార్యక్రమంలో ప్రతినిధులు, కుల పెద్దలు పాల్గొన్నారు.

ఘనంగా దేవతామూర్తుల ఊరేగింపు

కమ్మర్‌పల్లి, ఏప్రిల్28: మండంలోని బషీరాబాద్ కాడిచెరువులో కొలువై ఉన్న గంగపుత్రుల ఆరాధ్యదైవం గంగమ్మమాత ఆలయ ప్రథమ వార్షికోత్సవం జాతర ఉత్సవాల్లో భాగంగా ఆదివారం వలగొడుగు ఊరేగింపు ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక పోచమ్మఆలయం నుంచి ప్రారంభమైన ఈ ఊరేగింపు గ్రామ ప్రధాన వీధులగుండా సాగుతూ చెరువు వద్దగల గంగమ్మమాత ఆలయానికి చేరుకుంది. ఊరేగింపులో మహిళలు మంగళహారతులతో పాల్గొన్నారు. మహిళలు, యువకుల కోలాటాలు ఊరేగింపులో ఆకర్షణగా నిలిచాయి. వలగొడుగు ఊరేగింపులో గంపుత్ర సంఘం అధ్యక్షుడు తోపారపు శివానంద్, ఉపాధ్యక్షుడు తోపారపు గంగారాం, సభ్యులు ముత్తన్న, మోహన్, శ్రీనివాస్, దినేష్, ముత్తన్న, పోషన్ననారాయణ, కమిటి సభ్యులు యువజన సంఘాల సభ్యులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఉత్సవాల్లో భాగంగా సోమవారం గ్రామ పురోహితులు జిమ్మెగారి అజయ్ శర్మ శ్రీ శివగంగాభవాని కల్యాణోత్సవం, అన్నదాన కార్యక్రమాలు, సాయంత్రం దేతామూర్తుల పల్లకీ సేవా కార్యక్రమాలు ఉంటాయని భక్తులు పెద్దసంఖ్యలో హాజరుకావాలని నిర్వాహకులు కోరారు.


పోచమ్మ బోనాలతో ఊరేగుతున్న గౌడ సంఘ సభ్యులు, మహిళలు

కమ్మర్‌పల్లిలో ఘనంగా పోచమ్మ బోనాల ఊరేగింపు

కమ్మర్‌పల్లి, ఏప్రిల్ 28: మండల కేంద్రం శివారులోని బ్రహ్మంగారి గుట్టపై దక్షిణవైపు కొలువుదీరిన గౌడకులస్తుల ఆరాధ్య దైవం రేణుకా ఎల్లమ్మ ఆలయ ఐదో వార్షికోత్స మహోత్సవంలో భాగంగా మూడోరోజు ఆదివారం గ్రామగౌడ సంఘాల, యువజన సంఘాల సభ్యుల ఆధ్వర్యంలో ఎల్లమ్మ బోనాలు ఊరేగింపు నిర్వహించారు. ఉదయం నుంచి ఒక్కో ఇంటి నుంచి బోనాలతో స్థానిక భరతమాత విగ్రహంవద్దకు చేరుకోగా మధ్యాహ్నం మండుటెండను సైతం లెక్కచేయకుండా మహిళలు గ్రామంలో పోచమ్మ బోనాల ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ గౌడకుల సంఘం అద్యక్షుడు సభ్యులు ఎం సుభాష్‌గౌడ్, సల్లూరి బాలగౌడ్, రాంపూర్ శంకర్ గౌడ్, ఇటిక్యాల దశాగౌడ్ సత్యపాల్ గౌడ్, సత్యనారాయణ గౌడ్, గౌడ కులసంఘ సభ్యులు, గౌడసంఘ యువజన సంఘం సభ్యులు, యువకులు, మహిళలు, గ్రామస్తులు పెద్దసంఖ్యలో బోనాల ఊరేగింపులో పాల్గొన్నారు. సోమవారం గంగాకటమయ్య బోనాలపుట్ట నందు కార్యక్రమాలు ఉంటాయని, 30న ఉదయం 7గంటలకు ఎల్లమ్మ బోనాలు, ఆలయంలో ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మండల పరిసర గ్రామాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో బోనాల ఊరేగింపులో పాల్గొనాలని కోరారు.


బషీరాబాద్‌లో వలగొడుగు ఉత్సవ ఊరేగింపు నిర్వహిస్తున్న గంగపుత్ర సంఘం సభ్యులు



మాట్లాడుతున్న డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శంతన్

విద్యావిధానంలో లోపాలను సవరించాలి

సిరికొండ, ఏప్రిల్ 28: నూతన విద్యావిధానం-2020లో ఉన్న లోపాలను సవరించిన తర్వాతే అమలు చేయాలని డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శంతన్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. సిరికొండలో ఏర్పాటు చేసిన సమావేశంలో శంతన్ మాట్లాడుతూ.. గత మూడేళ్లుగా దేశంలో అమలవుతున్న నూతన జాతీయ విద్యా విధానం-2020లో అనేక లోపాలున్నాయని ఆయన చెప్పారు. లోపాల ఫలితంగా విద్యా కార్పొరేటీకరణ జరగడమే కాకుండా పేద మధ్య తరగతి కుటుంబాల విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతారని శంతన్ చెప్పారు. జాతీయ విద్యా విధానంలోని లోపాలను సవరించి అమలు చేయాలని డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శంతన్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించారు. నూతన జాతీయ విద్యావిధానం వల్ల విదేశీ యూనివర్సిటీలు విచ్చల విడిగా దేశంలో స్థాపించుకోవడానికి వెసులు బాటు కల్పించిన విధానం బాగులేదన్నారు. దేశంలో ప్రయివేట్ రంగంలో యూనివర్సిటీలు రావడం వల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు రిజర్వేషన్లను కోల్పోతారని ఆయన అన్నారు. విద్యను వ్యాపార దృక్పథంతో నిర్వహించే విధంగా సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుల పేరిట పెద్ద ఎత్తున ఫీజులు పెరుగుతాయని దీని వల్ల పేద మధ్య తరగతి వర్గాల పిల్లలు చదువుకు దూరమవుతారని ఆయన ప్రభుత్వానికి గుర్తు చేశారు. విదేశీ యూనివర్సిటీల ఏర్పాటును కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలని ఆయన కోరారు. కొనసాగుతున్న పేద బడుగు బలహీన, దళిత, విద్యార్థుల రిజర్వేషన్లను యథాతథంగా కొనసాగించాలని శంతన్ కోరారు. ప్రాథమిక స్థాయి వరకు మాతృ భాషలో ఉచిత నిర్బంధ విద్యను కొనసాగించాలన్నారు. విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను నిలిపివేయాలనే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని డీటీఎఫ్ నేత ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో డీటీఎఫ్ జిల్లా శాఖ అధ్యక్షుడు బాలయ్య పాల్గొన్నారు.

గర్భిణీ మృతి.. బంధువుల ఆందోళన

నిజామాబాద్ రూరల్, ఏప్రిల్, 28: రూరల్ పరిధిలోని కాలూరు గ్రామానికి చెందిన కమటం శ్రవంతి (40) గర్భిణీ మృతి చెందడంతో.. ఆమె మృతికి ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని యువతి బంధువులు ఆసుపత్రి వద్ద ఆందోళనకు దిగిన ఘటన జిల్లా కేంద్రంలో జరిగింది. యువతి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. కాలూరు గ్రామానికి చెందిన శ్రవంతి నాలుగు నెలల గర్భిణి. ఆమెకు ఈనెల 27న శనివారం ఉదయం తీవ్రమైన కడుపునొప్పి రావడంతో జిల్లా కేంద్రంలోని వీక్లీ మార్కెట్‌లోని కీర్తిసాయి ఆసుపత్రి తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు గర్భిణిని పరీక్షించి స్కానింగ్ చేశారు. శిశువు కడుపులోనే మృతిచెందిందని తేల్చారు. మృత పిండాన్ని బయటకు తీసేందుకు ఆపరేషన్ అవసరం లేదని, మెడిసిన్‌తోనే కరిగిపోతుందని తెలిపారు. వైద్యుల సూచనలతో మందులు తీసుకుని ఇంటికి వెళ్లిన గర్భిణికి తగ్గకపోగా తీవ్రమైన రక్తస్రావం జరిగింది. ఆందోళన చెందిన యువతి భర్త ఆసుపత్రికి ఫోన్‌చేసి సమస్య చెప్పాడు. దాంతో వాళ్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కొబ్బరిబొండాం తాగిస్తే కడుపు చల్లబడుతుందని వైద్యులు సూచించారు. అయినా కడుపునొప్పి తగ్గకపోవడంతో శనివారం రాత్రి గర్భిణిని కీర్తిసాయి ఆసుపత్రికి తీసుకువచ్చారు. యువతిని పరిశీలించిన వైద్యులు ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. దాంతో యువతి బంధువులు తీవ్ర ఆగ్రహానికి లోనయ్యారు. ఆసుపత్రి వద్ద మృతదేహం ఉంచి ఆందోళన చేపట్టారు. వైద్యుల చికిత్స వికటించడం వల్లే శ్రవంతి మృతిచెందిందని వాపోయారు. దానికి ఆసుపత్రి వైద్యులే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. చివరకు పోలీసులు వచ్చి యువతి బంధువులను సముదాయించారు.

దుబ్బాకలో బోనాల పండుగ

ధర్పల్లి, ఏప్రిల్ 28: మండలంలోని దుబ్బాక గ్రామంలో ఆదివారం బోనాల పండుగ అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బోనాలను గ్రామంలో ఊరేగించి గ్రామ శివారులోగల పెద్దమ్మ ఆలయం వద్దకు తీసుకెళ్లారు. డప్పు చప్పుడు, మంగళవాయిద్యాలతో బోనాలను గ్రామంలో ఊరేగించారు. ప్రతియేటా బోనాల పండుగను గ్రామంలో అత్యంత వైభవంగా ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు.

ప్రమాదంలో ఒకరికి గాయాలు

సిరికొండ, ఏప్రిల్ 28: సిరికొండ పోలీసు స్టేషన్ పరిధిలోని సరిపల్లి తండా సమీపంలో ఆదివారం మధ్యాహ్నం బైక్‌పై వెళ్తున్న వ్యక్తి ఎదురుగా వస్తున్న బస్సు వెనక భాగం తగలడంతో బైక్‌పై ఉన్న వ్యక్తి పడిపోయి గాయాలపాలయ్యాడు. ఇందల్వాయి గ్రామానికి చెందిన నర్సయ్య అనే వ్యక్తి తన మిత్రుడు బైక్‌పై వాల్గోట్ వైపు నుంచి ఇందల్వాయి వెళ్తుండగా ఎదురుగా వస్తున్న బస్సు వెనక భాగం తగలడంతో బైక్‌పై కూర్చున్న నర్సయ్య కిందపడిపోవడంతో కాళ్లు విరిగాయి. బాధితులు ఇచ్చిన సమాచారం మేరకు ఎస్సై రమేష్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. చికిత్స నిమిత్తం నర్సయ్యను నిజామాబాద్ ఆసుపత్రికి తరలించారు.

ధర్పల్లిలో చోరీ

ధర్పల్లి, ఏప్రిల్ 28: మండల కేంద్రంలోగల బీసీ కాలనీలో శనివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. దీనికి సంబంధించిన వివరాలు ఎస్సై విక్రమ్ తెలిపిన మేరకు ఇలా ఉన్నాయి. బీసీ కాలనీకి చెందిన సుంకరి నవీన్ శనివారం రాత్రి 10గంటల ప్రాంతంలో ఆరుబయట కుటుంబ సభ్యులతో కలిసి నిద్రించాడు. అర్ధరాత్రి లేచి చూసే సరికి చోరీ జరిగినట్లు తెలుసుకున్నాడు. రెండు సెల్‌ఫోన్‌లతో పాటు రెండు తులాల బంగారం, పర్సు చోరీకి గురైనట్లు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

హాల్ట్ స్టేషన్ ఏర్పాటు ఎప్పుడో?



కమ్మర్‌పల్లి హాల్ట్‌స్టేషన్ ఏర్పాటుకు ప్రతిపాదిత స్థలం



రైల్వేశాఖ ఆధీనంలో ఉన్న స్థలం ఇదే..

- కమ్మర్‌పల్లి రైల్వే హాల్ట్ స్టేషన్ కోసం ఎదురుచూస్తున్న మండల ప్రజలు
- హాల్ట్ స్టేషన్ ఏర్పాటు విషయంలో ఊసెత్తని ప్రజాప్రతినిధులు, స్పందించని అధికారులు

కమ్మర్‌పల్లి, ఏప్రిల్ 28: నిజామాబాద్-పెద్దపల్లి రైల్వేలైన్ ఏర్పడి రైలు కమ్మర్‌పల్లి మీదుగా పరుగులు తీస్తున్నా.. కమ్మర్‌పల్లి మండల ప్రజలు రైలెక్కే అదృష్టానికి నోచుకోవడంలేదు. తాతల కాలం నుంచి రైలు కోసం ఎదురు చేసిన మండల ప్రజల కల నెరవేరిందికాని కేవలం రైలు రాకపోకలు చేయడానికి మాత్రమే నోచుకుంటున్నారు. రైలు తమ గ్రామంలో ఆగితే వ్యాపారాభివృద్ధి జరిగి రాకపోకలకు మార్గం సుగమమవుతుందనుకున్న మండల ప్రజల ఆశాలు నిరాశలుగానే మిగిలి పోతున్నాయి. కమ్మర్‌పల్లి మండల కేంద్రం రైల్వేస్టేషన్‌కు నోచుకోకపోగా కనీసం అధికారులు ఇచ్చిన హామీ హాల్ట్ స్టేషన్‌కు సైతం నోచుకోని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. నిజామాబాద్-పెద్దపల్లి వరకు నడుస్తున్న రైలు కమ్మర్‌పల్లిలో ఆగే నిమిత్తం రైల్వే స్టేషన్ ఏర్పాటు చేయాలన్న స్థానిక నాయకులు గతంలో విశ్వప్రయత్నాలు చేశారు. సంబంధిత శాఖ పై ఉన్నతాధికారులకు విన్నవించుకున్నారు. స్టేషన్ ఏర్పాటు ప్రస్తుతానికి కుదరదని కేవలం హాల్ట్‌స్టేషన్ ఏర్పాటు చేస్తామని హామీలిచ్చారు. కానీ ఇప్పటివరకు ఈ విషయంలో ఎలాంటి చర్యలు తీసుకోక పోవడంతో మండల ప్రజలు నిరాశకు లోనవుతున్నారు. 2016 డిసెంబర్ 27న రైల్వేలైన్ ఏర్పాటు పనుల పరిశీలనకు వచ్చిన రైల్వే జీఎం, ఆర్ఎం తదితర అధికారులను స్థానిక మండల స్థాయి ప్రజాప్రతినిధులు కమ్మర్‌పల్లి రైల్వేస్టేషన్ కోసం వినతిపత్రం అందజేశారు. తమ గ్రామానికి రైల్వేస్టేషన్ తప్పక ఏర్పాటు చేయాలని కోరారు. ఏజీఎం పాదాలు పట్టుకుని వేడుకున్నారు. కమ్మర్‌పల్లిలో రైల్వేస్టేషన్ ఏర్పాటు చేస్తే చుట్టుపక్కల మండలాలు, గ్రామాల వారికి ఈ ప్రాంత రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని విన్నవించారు. దీంతో స్పందించిన ఏజీఎం కమ్మర్‌పల్లిలో రైల్వేస్టేషన్ ఏర్పాటుకు సమయంపడుతుందని ప్రస్తుతానికి ఉప్లూర్ వెళ్లే దారిలో నిర్మించిన రైల్వే బ్రిడ్జి నుంచి తిమ్మాపూర్ రోడ్డు వరకు గల స్థలంలో ఎక్కడో ఒక చోట హాల్ట్‌స్టేషన్ ఏర్పాటు చేస్తామని, అక్కడే తాత్కాలిక టికెట్ కౌంటర్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ప్రయాణికుల సంఖ్యపెరిగితే స్టేషన్ ఏర్పాటుకు కృషిచేస్తామని హామీ ఇచ్చారు. కానీ ఆ హామీ హామిగానే మిగిలిపోతు వస్తుంది. నాటినుంచి నేటివరకు హాల్ట్ స్టేషన్ ఏర్పాటుకు ఎలాంటి చర్య చేపటకపోగా హాల్ట్‌స్టేషన్ విషయంలో స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు పట్టించుకున్న దాఖలాలు కనిపించలేదు. ఈ విషయంలో మండలంలోని గ్రామాలవారీగా తీర్మానాలు చేసి హాల్ట్‌స్టేషన్ కోసం ఉద్యమిస్తే తప్ప అధికారులు, ప్రజాప్రతినిధుల్లో చలనం రాదని స్థానికులుంటున్నారు.



కల్యాణోత్సవంలో పాల్గొన్న గంగపుత్రులు, మహిళలు

ఘనంగా శివగంగా మాత కల్యాణోత్సవం

కమ్మర్‌పల్లి, ఏప్రిల్ 18: మండంలోని హసాకొత్తూర్ చెరువువద్ద ఆలయంలో కొలువుదీరిన గంగపుత్రుల ఆరాధ్య దైవం గంగా భవాని మాత ఆలయ ద్వితీయ వార్షికోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆదివారం ఆలయ పురోహితులు జిమ్మెగారి అజయ్‌శర్మ ఆధ్వర్యంలో శివగంగా భవాని కల్యాణోత్సవం వేద మంత్రోత్చరనల మధ్య ఘనంగా నిర్వహించగా గంగపుత్ర సంఘ సభ్యులు, నిర్వాహ కమిటీ సభ్యులు అమ్మవారికి పట్టువస్త్రాలు ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. ఆలయ ఆవరణలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం దేవతా మూర్తుల పల్లకి సేవ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో గంగపుత్ర సంఘం అధ్యక్షుడు ఏర్గట్ల గంగాధర్, ఉపాధ్యక్షుడు జుంబెరాత్ సత్యనారాయణ, కార్యదర్శి ఎల్ల శేఖర్, వివిధ గ్రామాలకు చెందిన గంగపుత్ర, యువజన సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల ఫీజుల దోపిడీని అరికట్టాలి



మాట్లాడుతున్న పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి నామాల ఆజాద్

కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 28: ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీని అరికట్టాలని పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి నామాల ఆజాద్ అన్నారు. ఆదివారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించిన అడ్మిషన్‌ల ప్రక్రియకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వకముందే ముందస్తు అడ్మిషన్ల పేరిట విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇప్పటికైన రాష్ట్ర ప్రభుత్వంతో పాటు సంబంధిత విద్యాశాఖ అధికారులు స్పందించి ముందస్తు అడ్మిషన్లకు పాల్పడుతున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సురేష్, ఉపాధ్యక్షుడు సరిచంద్, జిల్లా నాయకులు నవీన్, సుశీల్, మహేష్, రాందాస్, బాలాజీ, సచిన్ తదితరులు పాల్గొన్నారు.

గాంధారి వంతెన సమీపంలో గుర్తు తెలియని శవం లభ్యం

గాంధారి, ఏప్రిల్ 28: మండల కేంద్రంలో గల వంతెన సమీపంలో పాడుబడ్డ బావిలో గుర్తు తెలియని మహిళ శవం లభ్యమైనట్లు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు చంపేసి గోనె సంచిలో కట్టి బావిలో పడేసినట్లు తెలిపారు. ఇటీవల మిస్సైన గాంధారికి చెందిన బుర్రి కీర్తనగా పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

ఎస్సీ వర్గీకరణ బీజేపీతోనే సాధ్యం

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ



దళిత సమ్మేళనంలో మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

పిట్లం, ఏప్రిల్ 28: కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు మాదిగలను మోసం చేస్తున్నాయని ఎమ్మార్పీ ఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ అన్నారు. ఆదివారం కామారెడ్డి జిల్లా పిట్లంలో బీజేపీ ఎస్సీ మోర్చ ఆధ్వర్యంలో దళిత సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మందకృష్ణ మాదిగా రాగా బీజేపీ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార ఘనంగా సత్కరించారు. అనంతరం మందకృష్ణ సభను ఉద్దేశించి మాట్లాడుతూ తాను బీజేపీకి కేవలం మద్దతుదారుడను కానీ నేను బీజేపీ వ్యక్తిని కాదని తెలిపారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ ఓడించడానికి బీజేపీకి పార్లమెంట్ ఎన్నికల్లో మద్దతు తెలుపుతున్నామన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఎస్సీ వర్గీకరణ కోసం ఎన్నికల ముందు హామీలు ఇచ్చి అమలు చేయలేదన్నారు. రాహల్‌గాంధీ, సోనియా గాంధీని ఎస్సీ వర్గీకరణ కోసం బిల్లు పెట్టమని పలుమార్లు కలిసినా ఫలితం లేకుండా పోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అప్పుడు అధికారంలోని రిజర్వేషన్లు అమలు చేయని వారు భవిష్యత్‌లో అమలు చేస్తారనుకోవడం అమాయకత్వం అన్నారు. ఎస్సీల వర్గీకరణకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ మద్దతు ఇవ్వడం జరిగిందన్నారు. ఆర్థిక అసమానత, సామాజిక న్యాయం జరగాలంటే జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి బీబీ పాటిల్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు. ఎంపీ బీబీ పాటిల్ మాట్లాడుతూ రెండు సార్లు గెలిపించిన ఓటర్లు మరోమారు ఆశ్వీరదిస్తే జహీరాబాద్ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేస్తానన్నారు. కేంద్రంలో మరోమారు రాబోయేది బీజేపీ ప్రభుత్వం అని, తనను గెలిపిస్తే జాతీయ రహదారులు, రైల్వేలైన్‌లు, కేంద్ర విశ్వవిద్యాలయాలు, మరింత అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గంగారాం, మండల అధ్యక్షుడు అభినయ్‌రెడ్డి, నాయకులు జగదీష్, అశోక్‌రాజ్, వడ్ల శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఖలీల్

మే డేను విజయవంతం చేయాలి

- సీఐటీయూ నాయకుడు ఖలీల్

బాన్సువాడ టౌన్, ఏప్రిల్ 28 : కార్మికులంతా సంఘటితంగా ఉంటూ మేడేను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు ఖలీల్ కార్మికులకు పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత 44 చట్టాలను నాలుగు కోడ్లుగా విభజన చేసి కార్మిక చట్టాలను తుంగలో తొక్కిందని మండిపడ్డారు. కార్మికులంతా ఏకమై ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి పోరాటాల ద్వారా నాలుగు కోడ్‌లను తిప్పి కొట్టాలన్నారు. జిల్లాలోని కార్మికులందరూ కలిసి మేడేను జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో మున్సిపల్ కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బుజ్జిగారి సాయిలు, రాజు, విఠల్, శివరాజు తదితరులున్నారు.

రోడ్డు ప్రమాదంలో హెడ్ కానిస్టేబుల్ మృతి

తాడ్వాయి, ఏప్రిల్ 28: తాడ్వాయి పోలీసుస్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ తాళ్ల పల్లి శ్రీనివాస్‌గౌడ్(50) శనివారం రాత్రి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. విధులు నిర్వహించడం కోసం తన కారులో రాత్రి 11గంటల 45 నిమిషాలకు ఇంటి నుంచి బయలుదేరారు. తాడ్వాయి శివారులోకి రాగానే కెనాల్ వద్ద ఆగి ఉన్న లారీని ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే గమనించిన స్థానికులు ఆయనను కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమంగా ఉండడంతో వెంటనే వైద్యులు మెరుగైన చికిత్స కోసం అంబులెన్స్‌లో హైదరాబాద్‌కు తరలిస్తున్న సమయంలో మార్గమాధ్యలోనే మృతి చెందాడు. లారీ డ్రైవర్ నిర్లక్ష్యంగా పార్కింగ్ చేయడంతోనే లారీని ఢీకొట్టుకుని హెడ్‌కానిస్టేబుల్ మృతి చెందినట్లు ఏఎస్ సంజీవ్ తెలిపారు. మృతుడి భార్య జ్యోతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.



మాట్లాడుతున్న నాయకులు

'మతతత్వ రాజకీయాలు చేస్తున్న బీజేపీని ఓడించాలి'

పెద్దబజార్, ఏప్రిల్ 28: ప్రజాసమస్యలను గాలికి వదిలి మతతత్వ రాజకీయాలు చేస్తున్న బీజేపీని ఓడించాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ జాతీయ నాయకుడు రాయల చంద్రశేఖర్, కట్టరామ అన్నారు. ఆదివారం నగరంలోని కోటగల్లిలో గల ఎన్ఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం నియంత్రిత్వ పాలన సాగిస్తుందని ఆరోపించారు. ప్రతిపక్ష నాయకులపై ఐటీ, ఈడీ, సీబీఐలను ప్రయోగించి భయానకాన్ని సృష్టిస్తున్నారని అన్నారు. అవినీతి పేరుతో భయపెట్టి తన పార్టీలో చేర్చుకుంటున్నారని అన్నారు. లేదంటే ప్రతిపక్ష ముఖ్యమంత్రులు మంత్రులపై కేసులు పెట్టి జైలుకు పంపుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సెక్రెటరియేట్ సభ్యులు వి.ప్రభాకర్, రాష్ట్ర నాయకులు నరేందర్, వనమాల కృష్ణ, దేవరాం, రామకృష్ణ, వెంకన్న, సాయగౌడ్, రాజేశ్వర్, ముత్తెన్న, మల్లేష్, వివిధ ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విషం తాగి ఒకరి ఆత్మహత్య

వర్ని, ఏప్రిల్ 28: మండలంలోని పాత వర్ని గ్రామానికి చెందిన సబ్బిడీ అనిల్(20)విషం తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ కృష్ణ కుమార్ తెలిపారు. తాగుడుకు బానిస కావడంతో తల్లిదండ్రులు మందలించడంతో మనస్తాపంతో పురుగుల మందు సేవించి ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు తెలిపారు. ఆదివారం మృతుడి తండ్రి శంకర్ ఫిర్యాదు మేరకు శవ పంచనామా అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.150	రూ.280	రూ. 300
వెన్‌కాబ్(కిలో)	రూ.155	రూ.285	రూ. 305

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.73,200	రూ.67,525	రూ.850

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్..

స్ర్కీన్-1 : రత్నం (11.30, 2.45, 6.00, 9.15)
స్ర్కీన్-2 : గాడ్జిల్లా అండ్ కాంగ్ (3డీ) (1.25, 7.10)
: మంజుమ్మల్ బాయ్స్ (4.05)
: బడే మియాన్ చోటే మియాన్ (హిందీ 3డీ) (10.05)
స్ర్కీన్-3 : మంజుమ్మల్ బాయ్స్ (1.00)
: టిల్లు స్క్వేర్ (4.00, 10.35)
: ది ఫ్యామిలీస్టార్ (7.10)
స్ర్కీన్-4 : ది ఫ్యామిలీస్టార్ (1.10)
: కొంచెం హాట్‌కే (తెలుగు) (4.35)
: మంజుమ్మల్ బాయ్స్ (7.15, 10.10)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్ర్కీన్-1 : రత్నం (1.30, 4.30, 7.30, 10.30)
స్ర్కీన్-2 : మంజుమ్మల్ బాయ్స్ (10.45,4.40,7.30,10.30)
: టిల్లు స్క్వేర్ (1.40)

దేవి : టిల్లు స్క్వేర్ (11.15, 2.15, 6.15, 9.15)
లలితమహాల్ : ఫ్యామిలీ స్టార్ (11.15, 2.15, 6.15 9.15)
నటరాజ్ : హ్యాపీడేస్ (11.15, 2.15, 6.15 9.15)
విజయ్ : రత్నం (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్